సాక్షి
సిద్దిపేట
గురువారం । 15 । మే । 2025



అటకెక్కిన అవుట్ పోస్టులు
మూడు జిల్లాలు.. 20 రైల్వేస్టేషన్లు.. రెండు వందల కిలోమీటర్ల పరిధి.. వెరసి ఒకే ఒక్క పోలీస్ అవుట్ పోస్టు వివరాలు 8లో ▸



72 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో 72 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. వివరాలు 8లో ▸



సొంత భవనాలు కరువు!
మహిళా స్వయం సహాయక సంఘాలకు శాశ్వత భవనాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వివరాలు 9లో ▸

రమణీయం.. రథోత్సవం



వర్ధరాజుల స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మర్కూక్ మండలం వర్ధరాజ్‌పూర్‌లో వర్ధరాజుల స్వామి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరిరోజు బుధవారం స్వామి వారి రథోత్సవం రమణీయంగా సాగింది. హనుమాన్ మాలధారులు పురవీధుల గుండా రథోత్సవాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు మహిళలు మంగళహారతులు ఇస్తూ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదాన కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.
– మర్కూక్(గజ్వేల్)

వైభవం.. గోవిందుడి విహారం



స్వామివారి ఊరేగింపులో భక్తజనం

పురాతన ప్రాశస్త్యం కలిగిన వర్గల్ వేణు గోపాలుని కోవెలలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విశేష అర్చనలు, సేవలతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి వేణుగోపాలుని హనుమంతోత్సవ సేవ నేత్రపర్వం చేసింది. విశేషాలంకృతులైన స్వామివారు రుక్మిణి, సత్యభామ సమేతులై హనుమత్ వాహనం అధిష్ఠించారు. పురవీధులలో విహరిస్తూ భక్తజనావళికి దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకుని భక్తులు తరించారు.
– వర్గల్(గజ్వేల్)

న్యూస్‌రీల్

ఎల్లమ్మ తల్లి సన్నిధిలో జిల్లా జడ్జి



అమ్మవారిని దర్శించుకుంటున్న జిల్లా జడ్జి సాయి రమాదేవి

హుస్నాబాద్: రేణుకా ఎల్లమ్మ జాతరను పురస్కరించుకొని బుధవారం జిల్లా జడ్జి సాయి రమాదేవి, ఏసీపీ సదానందంలు ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ధర్మకర్తలు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ తెప్పోత్సవం



మాట్లాడుతున్న చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: పట్టణంలోని కోమటిచెరువులో గురువారం హనుమాన్ తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీరామరాజు రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో మాలధారులకు అన్నప్రసాదం 16 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. దేవాలయం నుంచి శోభాయాత్రగా బయలుదేరి కోమటి చెరువు వద్ద తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆలయ అర్చకులు వైద్య కృష్ణమాచార్య, ట్రస్ట్ సభ్యులు నేతి కైలాసం, గ్యాదరి పరమేశ్వర్, నందిని శ్రీనివాస్, కుమ్మరికుంట రమేష్, తిప్పరాజు మధుసూదన్, చింత శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థ హైదరాబాద్‌లో మూడేళ్ల పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీకాంతరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన అనాథలు, తల్లి లేదా తండ్రి లేని బాలికలు టెన్త్ పాసై ఉన్న వారు అర్హులన్నారు. డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, డిప్లొమా కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం జిల్లా కలెక్టరేట్ రెండో అంతస్తు, రూమ్ నంబర్ 528లో సంప్రదించాలని సూచించారు.

రేపు క్రికెట్ జట్టు ఎంపిక

సిద్దిపేటజోన్: అండర్ –25 విభాగంలో జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 16న నిర్వహించనున్నట్లు సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో జట్టును ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 31ఆగస్టు 2000వ సంవత్సరం తర్వాత జన్మించిన వారు జట్టు ఎంపికకు అర్హులని పేర్కొన్నారు.

మిత్తిమీరుతుండ్రు

జిల్లాలో జోరుగా వడ్డీ దందా



- వ్యాపారుల ఇష్టారాజ్యం
- నిబంధనలు బేఖాతర్
- ఆర్థికంగా చితికిపోతున్న సామాన్యులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

చిన్నకోడూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ప్రైవేటుగా రూ.50 వేలు అప్పు తీసుకుని వ్యాపారం చేపట్టారు. నెల నెల వడ్డీ కడుతున్నారు. కొద్ది నెలలుగా వ్యాపారం సాగక వడ్డీ చెల్లించలేకపోయారు. దీంతో ఆ వడ్డీ వ్యాపారి బలవంతంగా తన బైక్‌ను లాక్కుపోయారు. అతడు ఎవరికి చెప్పుకోలేక కుమిలిపోతున్నారు. ఇతని పరిస్థితే కాదు జిల్లాలో వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తీసుకున్న వారిది దాదాపు ఇలాగే ఉంది. విషయం ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. సంబంధిత అధికారుల నిఘా లేకపోవడంతో వడ్డీ వ్యాపారులు సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): జిల్లాలో వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎదుటి వారి కష్టాలు, అవసరాలు ఆసరాగా చేసుకొని వడ్డీ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో వడ్డీ వ్యాపారం మితిమీరిపోతోంది. రూ.3 నుంచి రూ.10 వరకు అధిక వడ్డీ వసూలు చేస్తూ బాధితులకు నరకయాతన చూపుతున్నారు. వ్యక్తి అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న వడ్డీ వ్యా పారులు అందినకాడికి దండుకుంటున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. అధిక వడ్డీలు చెల్లించలేక అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జిల్లాలో ప్రతియేటా రూ.కోట్లలో వడ్డీ వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. ఇదిలాఉంటే.. కొందరు తమ అవసరాల కోసం పైసా పైసా కూడబెట్టి చీటీలు కడుతున్నారు. వారి కష్టాన్ని కొంత మంది నిర్వాహకులు కాజేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

అధిక వడ్డీతో...

ఎవరైనా సొమ్ము అవసరం ఉండి వ్యాపారి దగ్గరకు వెళ్తే ముందస్తుగానే అధిక వడ్డీ తీసుకుని మిగతాది ఇచ్చేస్తున్నారు. రోజు వారీగా, వారానికి నిర్ణయించిన మేరకు డబ్బులు కట్టాలి. ఉదాహరణకు ఒక మహిళ రూ.10 వేలు తీసుకుంటే ముందుగానే రూ.వెయ్యి వడ్డీగా తీసుకుని రూ.9 వేలు ఇస్తున్నారు. రోజు వారీగా, వారానికి ఒకసారి సొమ్ము చెల్లించేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఆలస్య మైతే వడ్డీ వేస్తున్నారు. వడ్డీ వ్యాపారం 'మూడు పువ్వులు.. ఆరు కాయల' చందంలా సాగుతుండటంతో ఈ దందా జిల్లాలో రోజు రోజుకు విస్తరిస్తోంది.

నియంత్రిస్తేనే మేలు..

ప్రభుత్వ అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం ముసుగులో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఇలాంటి వారితో చిరు, వీధి వ్యాపారులు, దినసరి కూలీలు నష్టపోతున్నారు. బాధితులు ఎవరికి చెప్పాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికడితే ప్రజలకు మేలు జరుగుతుంది.

నిబంధనలు ఇవీ..

వడ్డీ వ్యాపారం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు విధించింది. వడ్డీ తీసుకునే ప్రజలపై భారం పడకుండా, ఇబ్బందులు కలగకుండా చట్టాల్ని రూపొందించింది. దీని కోసం మనీ లెండింగ్ యాక్టును అమలులోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ అనుమతి తీసుకుంటేనే వడ్డీ వ్యాపారం చేయాలి. ఇందుకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. వడ్డీ ఏడాదికి నిర్ణీత శాతంలోపు మాత్రమే తీసుకోవాలి. ఎన్ని నెలలు వడ్డీ ఇస్తారో దాని ప్రకారం విభజించుకోవాలి. ఏటా లెక్కలు రెవెన్యూ అధికారులు పరిశీలించాలి. దీనికి తోడు ఈ వ్యాపారానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. కానీ వ్యాపారులు ఎక్కడా అనుమతులు తీసుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం..

వడ్డీ వ్యాపారం కొనసాగుతున్నట్లు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఎక్కడైనా వడ్డీ వ్యాపారం, అధిక వడ్డీ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అలాంటి వ్యాపారాలు కొనసాగితే ఫిర్యాదు చేయండి
– శ్రీను, సిద్దిపేట రూరల్ సీఐ

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



న్యాయమూర్తికి పూలమొక్కను అందిస్తున్న కలెక్టర్

సిద్దిపేటఅర్బన్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందను కలెక్టర్ మనుచౌదరి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. న్యాయమూర్తి కుటుంబ సమేతంగా కాళేశ్వరం వెళ్తున్న క్రమంలో సిద్దిపేటలోని హరిత హోటల్‌లో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా కలెక్టర్ న్యాయమూర్తిని కలిసి జిల్లాలోని న్యాయ సంబంధమైన విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా జూనియర్ జడ్జి తరణి, ఆర్డీఓ సదానందం, డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య, న్యాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రావొద్దు



గంగిరేణు చెట్టు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సదానందం

- ఏసీపీ సదానందం
- కొమురవెల్లి మల్లన్న ఆలయ సందర్శన
- శాంతిభద్రతలపై సిబ్బందికి సూచనలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం స్థానిక పోలీసులకు సూచించారు. బుధవారం ఆలయంలోని గంగిరేణిచెట్టు ప్రాంగణం, సాధారణ, వీవీఐపీ దర్శనం తదితర ప్రదేశాలతో పాటు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌ను చేర్యాల సీఐ శ్రీనుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. జేబుదొంగలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. శాంతి భద్రతలకు పెద్దపీట వేసి గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెంచాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డుప్రమాదాల వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజారక్షణే ధ్యేయంగా పనిచేస్తూ ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని అన్నారు. అనంతరం చేర్యాల మండలం గురిజకుంట గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

మద్దూరు(హుస్నాబాద్): అవినీతికి తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం సిబ్బందికి సూచించారు. బుధవారం మద్దూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు ఎస్‌ఐ షేక్ మహబూబ్‌లు ఏసీపీకి పూల మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. ఏసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలన్నారు. అనతంరం ఏసీపీని జయశంకర్ సేవా సమితి వ్యవస్థాపకులు కొత్తపల్లి సతీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ఆయిల్‌ఫెడ్ అధికారి శంకర్

సిద్దిపేటఅర్బన్: ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని, ఇతర పంటలతో పోలిస్తే అధిక లాభాలు వస్తాయని ఆయిల్‌ఫెడ్ అధికారి శంకర్, అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ రైతులకు సూచించారు. బుధవారం అర్బన్ మండలం మందపల్లిలోని రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తోందని, సబ్సిడీపై డ్రిప్, మొక్కలు అందజేస్తుందని, నాటిన తర్వాత నాలుగేళ్ల వరకు ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. అంతర పంటలను కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని, సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. నర్మెటలోనే ఆయిల్‌పామ్ రిఫైనరీ యూనిట్ ఉండటంతో మార్కెటింగ్‌కు ఇబ్బంది ఉండదని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ కౌసల్య, ఏఈఓ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ కీర్తన, రైతులు పాల్గొన్నారు.



పాలమాకుల కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

దండిగా ధాన్యం

రికార్డు స్థాయిలో కొనుగోళ్లు
- సకాలంలోనే ఖాతాలో డబ్బులు

నంగునూరు(సిద్దిపేట): గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. గత సంవత్సరం కంటే ఎక్కువ ధాన్యం రావడంతో కొనుగోలు కేంద్రాలు కళకళ లాడుతున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నా ఆకస్మాత్తుగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం టార్పాలిన్ కవర్లు అందజేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నంగునూరు మండలంలో ఐకేపీ ద్వారా ఏడు, పాలమాకుల పీఏసీఎస్ నుంచి 12, నంగునూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సన్న రకం వడ్లకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అన్ని గ్రామాల రైతులు ప్రస్తుత సీజన్‌లో దొడ్డు రకం వరితో పాటు సన్న వడ్లను సాగు చేశారు. వరి కోతలు ప్రారంభం కాగానే ఇప్పటి వరకు అన్ని సెంటర్లలో ఆశించిన స్థాయికి మించి ధాన్యం కొనుగోలు చేశారు.

23 సెంటర్ల ద్వారా ..

నెల రోజుల కిందట అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారుల ప్రారంభించారు. 23 సెంటర్ల ద్వారా ఇప్పటి వరకు 2,809 మంది రైతుల నుంచి 1,19,808 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. ఇందులో ఐకేపీ ద్వారా 1,130 మంది రైతుల నుంచి 41,630 క్వింటాళ్లు, పాలమాకుల పీఏసీఎస్ ద్వారా 1,127 మంది రైతుల నుంచి 54,238 క్వింటాళ్లు, నంగునూరు పీఏసీఎస్ ద్వారా 552 మంది రైతుల నుంచి 23,940 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రి చేసి వడ్లను మిల్లుకు తరలిస్తుండడంతో సకాలంలోనే తమ అకౌంట్‌లో డబ్బులు పడుతున్నాయని రైతులు తెలిపారు.

నిబంధనలు పక్కాగా పాటించాలి

కండీషన్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం: డీటీఓ క్రిస్టోఫర్




ప్రైవేట్ స్కూల్ యజమానులకు అవగాహన కల్పిస్తున్న క్రిస్టోఫర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు స్కూల్ బస్సుల విషయంలో నిబంధనలు పక్కాగా పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి క్రిస్టోఫర్ సూచించారు. బుధవారం జిల్లా కార్యాలయంలో స్కూల్ బస్సు యజమానులు, ప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బస్సుల ఫిట్ నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 15 ఏళ్లు దాటిన బస్సులను స్కూల్ యజమానులు పక్కన పెట్టాలని, రవాణా శాఖ నిబంధనల మేరకు నిర్ణీత గడువు దాటినా వాటిని స్క్రాప్ పరిధిలో చేర్చడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రతి స్కూల్ బస్సు ను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కండిషన్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి బస్సులో ప్రాథమిక వైద్య సదుపాయాలు ఉండేలా బాక్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందులో అవసరమైన అత్యవసర మందులు ఉంచాలని సూచించారు. ప్రతి బస్సులో అత్యవసర ద్వారం ఉండాలన్నారు. త్వరలో స్కూల్ బస్సుల ఫిట్ నెస్, నిబంధనలపై ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు.

వారంలో సీఎం రేవంత్ పర్యటన!

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం



న్యాల్‌కల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల్లో సీఎం జహీరాబాద్‌కు వస్తున్నట్లు సమాచారం ఉందని, ప్రజల నుంచి సమస్యలు రాకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. న్యామతాబాద్, శంశల్లాపూర్, టేకూర్, హుస్సేన్ నగర్, మల్గి, కాకిజన్‌వాడ తదితర గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. డప్పూర్, న్యామతాబాద్, వడ్డి, హద్నూర్, రుక్మాపూర్, రాంతీర్థ్ తదితర గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య గురించి విద్యుత్ ఎస్‌ఈతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పారిశుద్ధ్యం, రాజీవ్ వికాస్ తదితర పథకాలను గూర్చి సమావేశంలో చర్చించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఎస్‌ఈ రఘువీర్, డీఈఈ సుజాన్, డీపీఓ సాయిబాబా, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, ఆర్డీవో రాంరెడ్డి, ఎంపీఓ సౌజన్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టాక్ మార్కెట్ పేరిట సైబర్ మోసం

రూ.21.6 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ స్టాక్ మార్కెట్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ కొట్టించి నగదు కాజేశారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సూర్యోదయ కాలనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మార్చి 25న వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. అతడు తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇవ్వగా ఆన్‌లైన్‌లో నగదు ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. మొత్తం రూ.21.06 లక్షలు పెట్టుబడి పెట్టాడు. బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించ లేదు. తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

హోటల్‌పై విరిగిపడిన చెట్టు

తృటిలో తప్పిన ప్రమాదం



ధ్వంసమైన హోటల్

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలో మంగళవారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులకు బొడ్మట్‌పల్లి చౌరస్తాలో ఓ చెట్టు విరిగి గ్రామానికి చెందిన ఉప్పు నర్సప్ప హోటల్‌పై పడింది. హోటల్‌లో ఐదుగురు ఉండగా తృటిలో ప్రమాదం తప్పింది. హోటల్ ఉన్న సామగ్రి రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. బుధవారం ఉదయం ఆర్ఐ సాయి శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. హోటల్ ఆధారపడి జీవిస్తుండగా పూర్తిగా కూలిపోవడంతో రోడ్డున పడ్డారని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

వెల్దుర్తి(తూప్రాన్) : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ట్రైనీ ఎస్సై జ్యోతి, బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మర్కంటి సుశీల మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లగా కుమారుడు ఈశ్వర్ ప్రైవేట్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం ఈశ్వర్ ఇంటికొచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 20 తులాల వెండి వస్తువులతోపాటు రూ.30 వేలు నగదును దుండగులు దోచుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అదే విధంగా గ్రామానికి చెందిన ఖాజాపూర్ దుర్గయ్య ఇంటి తాళాలు పగులగొట్టగా చుట్టుపక్కల వారు మేల్కొనడంతో దుండగులు పరారయ్యారు.

వ్యక్తి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్: వ్యక్తి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ రమేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నేతాజీ నగర్‌కు చెందిన పాండరి రాజు 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అదే కాలనీకి చెందిన రాజవేళి ఈశ్వర్‌పై వచ్చిన అనుమానంతో ప్రత్యేక టీమ్ అతడిపై నిఘా పెట్టింది. బుధవారం పాత బస్టాండ్ సమీపంలోని మండే మార్కెట్ కల్లు కాంపౌడ్‌లో అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. రాజు తనకు డబ్బులు ఇవ్వాలని, ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకొని 10న శనివారం రాత్రి మద్యం సేవించిన అనంతరం రాజుకు ఫోన్ చేసి రాజీవ్ పార్క్‌కి రమ్మని చెప్పానన్నాడు. సున్నీతో రాజు గొంతు నులిమి, పక్కనే ఉన్న బండరాయితో ముఖంపై కొట్టి హత్య చేసినట్లు తెలిపాడు. మృతుడి భార్య హారతి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అటకెక్కిన అవుట్ పోస్టులు

మూడు జిల్లాల పరిధిలో 20 రైల్వేస్టేషన్లు

- ఒకే ఒక్క పోలీస్ అవుట్ పోస్టు
- 20 రైల్వేస్టేషన్లలో సవాల్‌గా మారిన భద్రత
- నిత్యం పెరుగుతున్న రైల్వే కేసులు

మూడు జిల్లాలు.. 20 రైల్వేస్టేషన్లు.. రెండు వందల కిలోమీటర్ల పరిధి.. వెరసి ఒకే ఒక పోలీస్ అవుట్ పోస్టు ఇదీ రైల్వేశాఖ పరిస్థితి. ఫలితంగా రైల్వేస్టేషన్ల పరిధిల్లో అక్రమ రవాణాలు, చోరీలు, పెరుగుతున్నాయి. ప్రతి నెలా కనీసం 25 వరకు కేసులు నమోదవుతున్నాయి. అవుట్ పోస్టులు లేక సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో అక్రమ రవాణాలు, నేరాలు పెరుగుతున్నాయి. జిల్లాకు ఒక పోస్టు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. – రామాయంపేట (మెదక్)



కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆవరణలో పోలీస్ అవుట్ పోస్టు



రైలులో తనిఖీ నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న రైల్వే అవుట్ పోస్టు పరిధిలో కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో కలిపి మొత్తం 20 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. మూడు జిల్లాల పరిధిలో సుమారుగా 200 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ విస్తరించి ఉంది. 20 రైల్వే స్టేషన్లకు సంబంధించి కామారెడ్డి స్టేషన్ ఆవరణలో ఒకే ఒక్క అవుట్ పోస్టు ఉంది. 35 ఏళ్ల కిందటే ఇది ఏర్పాటైంది. మెదక్ జిల్లాలో అక్కన్నపేట నుంచి ప్రారంభమై జిల్లా శివారు కూచారం వరకు 45 కిలోమీటర్ల మేర రైల్వే లైను విస్తరించి ఉండగా, జిల్లా పరిధిలో 12 స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ అవుట్ పోస్టు లేకపోవడంతో పోలీసుల పర్యవేక్షణ కరువై నెలలో కనీసం 15 నుంచి 18 వరకు రైల్వే కేసులు నమోదవుతున్నాయి. ఎక్కువగా యువకులు రైలు కింద పడి ఆత్మహత్యలు చేసుకోవడం, నిషేధిత గంజాయి సరఫరా, బియ్యం అక్రమ రవాణాతో పాటు దొంగతనాలు విపరీతంగా జరుగుతున్నాయి.

అవుట్‌పోస్టుల ప్రతిపాదనలు

ప్రతి జిల్లాలో కనీసం ఒక అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ ఉన్నతాధికారులు గతంలో నిర్ణయించినా అది కార్యరూపం దాల్చలేదు. ఈ అవుట్ పోస్టు పరిధి ఎక్కువగా ఉండటంతో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట నేరాలు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సిబ్బంది కొరతతో ఉన్న స్టాఫ్ పని భారంతో సతమతమవుతుంది. వెరసి పోలీసులు ఘటనా స్థలికి చేరుకోవడం ఆలస్యమవుతుండటంతో బాధితులు ఇబ్బందుల పాలవుతూ గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.

సీసీ కెమెరాలెక్కడ?

అన్ని రైల్వేస్టేషన్లలో చోరీలను అరికట్టడం, నేరస్తులను గుర్తు పట్టడానికి గాను వీలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలున్నా అవి అమలుకు నోచుకోలేదు. సీసీ కెమెరాలుంటే సాధ్యమైంత మేర నేరాలు తగ్గే అవకాశం ఉంది. 20 స్టేషన్లకు గాను కేవలం కామారెడ్డి స్టేషన్‌లో సీసీ ఫుటేజీ ఏర్పాటు చేశారు. కనీసం నాలుగైదు స్టేషన్లకు ఒక అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

మూడు జిల్లాల పరిధిలో ఉన్న రైల్వేస్టేషన్లు

కామారెడ్డి, తలమడ్ల, తిప్పాపూర్, బిక్కనూరు, రామేశన్‌పల్లి, అక్కన్నపేట, మీర్జాపల్లి, వడియారం, శ్రీనివాసనగర్, బ్రాహ్మణపల్లి, పాలాట పోతారం, మనోహరాబాద్, కూచారం, మెదక్, లక్ష్మాపూర్, ఔరంగాబాద్, నాచారం, గజ్వేల్, కొడకండ్ల, సిద్దిపేట రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఈ విషయమై రైల్వేశాఖకు చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో ఒక అవుట్ టపోస్టు ఏర్పాటుకై ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు దృష్టి సారించారని తెలిపారు.

ఇరిగేషన్ ఉద్యోగి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులే కారణం



రామకృష్ణ (ఫైల్)

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో ఇరిగేషన్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి–2 కథనం మేరకు.. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మోడ బోయిన రామకృష్ణ(35) సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్‌కి సంబంధించి ఇరిగేషన్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రామకృష్ణ ప్రైవేట్ సంస్థల్లో రుణం తీసుకున్న కారణంగా వచ్చే జీతం పూర్తిగా రుణం తీసుకున్న దానికి అసలు, వడ్డీ సరిపోతుండేది. ఇల్లు గడవం కష్టంగా మారడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో నిత్యం మనస్తాపానికి గురయ్యేవాడు. కానీ ఇంట్లో కుటుంబ సభ్యులకు రుణం తీసుకున్న విషయం తెలియజేయలేదు. తనలో తానే మదనపడుతుండేవాడు. బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అఖిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి

జహీరాబాద్ టౌన్: గుర్తు తెలియని వ్యక్తి జహీరాబాద్– వికారాబాద్ మధ్య నడిచే రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోహీర్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాగుడుకు బానిసై వ్యక్తి

నర్సాపూర్ రూరల్: తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నర్సాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్ఐ లింగం కథనం మేరకు.. శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన వాల్మీకి అవినాష్ (29) నిత్యం భార్యతో ప్రతిమతో గొడవ పడుతున్నాడు. తాగుడుకు డబ్బులు లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 72 కేసులు

సిద్దిపేట సీపీ అనురాధ



వాహనాల తనిఖీలో ఏసీపీ మధు, పోలీసు సిబ్బంది

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసు సిబ్బంది నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 72 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో బుధవారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ రవాణా నివారణకు వాహనాలు తనిఖీ చేయడం జరిగిందన్నారు. 72 డ్రంకెన్ డ్రైవ్ కేసులతోపాటు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై 299 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. తనిఖీల్లో సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూ టౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీసారి వందశాతం సాధించాలి

- విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే పురస్కారాలు
- తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ముఖ్యం
- ఎంపీ రఘునందన్‌రావు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ కలెక్టరేట్: వచ్చేయేడు నుంచి ప్రతీసారి వందశాతం ఫలితాలతో విద్యారంగంలో మెతుకు సీమ సత్తా చాటాలని, విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఇటీవలె వెలువడిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, పాఠశాలల హెచ్ఎంలకు సన్మాన, పురస్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, డీఈఓ రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరంలో నూరు శాతం ఫలితాలు లక్ష్యంగా మెతుకు సీమ జిల్లా కీర్తిని విద్యారంగంలో చాటి చెప్పాలని ఎంపీ పేర్కొన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులను ఇంటర్‌లో చేరేలా కలెక్టర్ తీసుకుంటున్న చొరవ క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు అందిస్తాయని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా 12వ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. 196 మంది విద్యార్థులు 550 మార్కులు సాధించగా, 17 మంది 570 పైన మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన 196 మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, 82 మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్, ప్రత్యేక అధికారులకు సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావును ఘనంగా సన్మానించారు. సమావేశంలో అన్ని మండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, సంబంధిత సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మహిళ మృతి



రత్నమ్మ(ఫైల్)

జహీరాబాద్: పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన ఘటన కోహీర్ మండలంలోని నాగిరెడ్డి పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ(55) పొలం పనులకు వెళ్లింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ నాగమ్మ గాయపడింది. వైద్యం నిమిత్తం ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ

మిరుదొడ్డి(దుబ్బాక): పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం భూంపల్లి ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నర్మెట కళవ్వ (52) దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతుండేది. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది 12న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి

పాపన్నపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పొడిచన్‌పల్లికి చెందిన సర్దన కిష్టయ్య(40)కు భార్య లక్ష్మి, కూతురు గంగమణి, కుమారుడు బీరప్ప ఉన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారు లేచి చూసే సరికి చనిపోయి ఉన్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పాపన్నపేట ప్రొబెషనరీ ఎస్ఐ నరేశ్ కేసు నమోదు చేసుకున్నారు.

గేదెను తప్పించబోయి లారీ డ్రైవర్

చిన్నకోడూరు(సిద్దిపేట): గేదెను తప్పించబోయి అదుపు తప్పి లారీ బోల్తా పడటంతో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాముని పట్ల శివారులో రాజీవ్ రహదారిపై బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మంచిర్యాల జిల్లా కాసీంపేట మండలం, మల్కపల్లి గ్రామానికి చెందిన వల్లూరి రాకేశ్ (26) సిద్దిపేటకు చెందిన వ్యాపారి వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంచిర్యాల నుంచి సిమెంట్ లోడ్ లారీతో సిద్దిపేటకు వస్తున్నాడు. రామునిపట్ల శివారులోకి రాగానే రోడ్డుపై గేదె అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి లారీ బోల్తా పడింది. డ్రైవర్ రాకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాకేశ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

కుటుంబ సమేతంగా దొంగతనాలు

- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- భారీగా బంగారం, రూ.4 లక్షల నగదు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య

సంగారెడ్డి టౌన్ : వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న కుటుంబ సభ్యుల ముఠాను బుధవారం సంగారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ బుధవారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డికి చెందిన యాదగిరి(44), అతడి భార్య అనిత(42), కుమారుడు మైనర్ బాలుడు(17), ముస్లాపూర్ గ్రామానికి చెందిన తలారి లక్ష్మీ (34) బుధవారం సంగారెడ్డి పట్టణంలో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని హత్నూర, సంగారెడ్డి టౌన్ రంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది ఆరు దొంగతనాలతోపాటు వికారాబాద్ నర్సాపూర్ మోమిన్‌పేటలో మొత్తం 53 దొంగతనాలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుల నుంచి 29 తులాల బంగారం, 47 తులాల వెండి, రూ.4 లక్షల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కేసులో కీలకంగా వ్యవహరించిన రూరల్ సీఐ క్రాంతి కుమార్, ఎస్ఐ రవీందర్, క్రైమ్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురు అరెస్ట్

తూప్రాన్: దారి దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివానందం బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌కు చెందిన మనీశ్ కుమార్ గుర్జీ గత నెల 30న మేడ్చల్ నుంచి ఆటోలో వస్తున్న క్రమంలో డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి మేడ్చల్‌కు చెందిన మల్లేశం, బొల్లారానికి చెందిన శ్రీకాంత్, నేరేడ్‌మెట్‌కు చెందిన మధును గుర్తించి అరెస్టు చేశామని తెలిపారు.

రూ.80 లక్షలు మోసం.. యువకుడి అరెస్ట్

- వ్యాపారంలో వాటాలు, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట
- గ్రామస్తుల నుంచి డబ్బులు వసూలు



నిందితుడు సాయి చరణ్

కొల్చారం(నర్సాపూర్): పాతికేళ్లు కూడా నిండని ఓ యువకుడు జనానికి మాయమాటలు చెప్పి భారీ ఎత్తున డబ్బులు కాజేశాడు. ఈ ఘటన బుధవారం కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. మండలంలోని సంగాయిపేట గ్రామానికి చెందిన మన్నె శేఖర్ ఇటీవల కుమారుడు చేసిన అప్పులు తీర్చే క్రమంలో మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి కుమారుడు మన్నె సాయి చరణ్ సొంత మండలానికి చెందిన వ్యక్తుల నుంచి వ్యాపారంలో వాటా, భూముల అమ్మకాల్లో మధ్యవర్తిత్వం,ప్రభుత్వ ఉద్యోగాల పేరిట దాదాపు రూ.80 లక్షల వరకు వసూలు చేశాడు. డబ్బులు ఇచ్చిన వారికి తిరిగి ఇవ్వకపోగా మూడు నెలలుగా కనిపించకుండా పోయాడు. ఇటీవల గ్రామానికి రావడంతో డబ్బులు ఇచ్చిన వారు తిరిగి ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారు. తన వద్ద లేవని చేతులెత్తేశాడు. బాధితులు కొల్చారం పోలీసులకు ఫిర్యాదు చేయగా సాయి చరణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. జనాలు అత్యాశకు పోవడంతోనే ఇలాంటి మోసాలు పెరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చేపలు పట్టే అధికారం మాదంటే మాది

- వల్లూర్‌లో చెరువు వద్ద ఇరువర్గాల పంచాయితీ
- ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు రంగ ప్రవేశం



ఇరువర్గాలతో చర్చిస్తున్న అధికారులు, పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): చెరువులో చేపలు పట్టే అధికారం తమదంటే తమదని గ్రామంలోని ఇరువర్గాలు చేపలు పట్టేందుకు సిద్ధం కావడంతో నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. బుధవారం నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలోని ఊరు చెరువులో ముదిరాజ్‌లు చేపలు పట్టేందుకు సిద్ధం కాగా విషయం తెలుసుకున్న గ్రామంలోని ఇతర వర్గాల ప్రజలు తాము కూడా చేపలు పట్టుకుంటామని చెరువు వద్దకు చేరుకున్నారు. గ్రామంలోని చెరువులో చేపలు పట్టే అధికారం తమకే ఉంటుందని ముదిరాజ్‌లు, లేదు చెరువుపై గ్రామంలోని అందరికీ అధికారం ఉంటుందని మిగితా గ్రామ ప్రజల మధ్య వివాదం నెలకొంది. గతంలో ఇలానే జరిగితే కొందరిని పోలీసులు బైండోవర్ చేశారు. తాజాగా బుధవారం మరోసారి వివాదం నెలకొని ఉద్రిక్తతకు దారి తీసింది. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న పోలీస్‌లు ఇరు వర్గాలను సముదాయించారు. గ్రామపంచాయతీ వద్దకు ఇరు వర్గాలను పిలిపించి చర్చించారు. ఇరు వర్గాలు కూడా తమకే హక్కులు ఉన్నాయని వాదనకు దిగడంతో 20 వరకు తమకు ఉన్న హక్కుల పత్రాలను పోలీస్‌లకు, రెవెన్యూ అధికారులకు అందించాలని సీఐ సూచించారు. అప్పటి వరకు ఎవరు చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరీం,మత్స్య శాఖ ఏడీ మల్లేశం, ఎఫ్‌డీఓ రామ్‌దాస్ పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు



ధ్వంసమైన వివేకానంద విగ్రహం

నంగునూరు(సిద్దిపేట):నంగునూరులోని వివేకానంద విగ్రహాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహంలో ముఖ భాగం ధ్వంసమైనట్లు బుధవారం గ్రామస్తులు గుర్తించారు. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మండల నాయకులతో కలిసి రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ శ్రీనుకు ఫిర్యాదు చేశారు. ప్రొబిషనల్ ఎస్ఐ సౌజన్య ఘటనా స్థలానికి చేసుకొని విగ్రహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తామని చెప్పారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ వివిధ పార్టీల నాయకులు గురువారం నంగునూరు బంద్‌కు పిలుపునిచ్చారు.

అశ్లీల వీడియోలు పోస్ట్ చేస్తే కటకటాలకే?

- మెదక్ పట్టణంలో బీటెక్ విద్యార్థిపై కేసు
- జిల్లాల్లో మరో మూడు చోట్ల కేసులు
- మెదక్ పట్టణ సీఐ నాగరాజు



మెదక్ మున్సిపాలిటీ: సోషల్ మీడియాలో ఇక పై అశ్లీల పోస్టులు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని మెదక్ పట్టణ సీఐ నాగరాజు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. యువత గూగుల్‌లో ఫోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి ఎఫ్‌బి, ఇన్‌స్టాగామ్‌లలో పోస్టు పెడుతున్నారని, ఎలాంటి వారి పై కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో అశ్లీల పోస్టులపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ నిఘా పెట్టిందన్నారు. మెదక్ పట్టణంలో బీటెక్ విద్యార్థి అశ్లీల వీడియో పోస్టు చేస్తే ఆ యువకుడి పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే జిల్లాలో టేక్మాల్, చిన్న శంకరం పేట, తూప్రాన్‌లలో ఫోర్న్ వీడియోలు పోస్టు చేసిన వారి పై కేసులు నమోదయ్యాయని తెలిపారు. యువత అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా వీడియో పోస్టు చేసే ముందు జాగ్రత్తగా ఆలోచించి చేయాలని సూచించారు. తప్పుడు పోస్టులు సోషల్ మీడియాలో పెట్టి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించిన భార్య
- హవేళిఘణాపూర్‌లో ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి మరో వ్యక్తికి సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించింది భార్య. ఈ ఘటన మెదక్ జిల్లా హవేళిఘణాపూర్‌లో చోటు చేసుకుంది. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన మైలి శ్రీను(25) ఏప్రిల్ 16న ఇంట్లో నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయాన్ని భార్య లత 28న పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడి భార్య లత అదే గ్రామానికి చెందిన మల్లేశంతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయంలో పలుమార్లు పంచాయితీ పెట్టారు. దీంతో ఎలాగైనా భర్తను హత్య చేసి అడ్డు తొలగించుకోవాలని భావించిన లత అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు మోహన్‌కు రూ.50 వేలు సుపారీ ఇచ్చి హత్యకు ఒప్పందం కుదుర్చుకుంది. పథకం ప్రకారం గత నెల 16న మధ్యాహ్నం శ్రీనును బ్యాతోల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి మద్యం, కల్లు సేవించి సీసాతో నెత్తిపై కొట్టగా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ఈ హత్యకు వివాహేతర కారణమని, దీనికి కారణమైన మృతురాలు భార్య మైలి లత, మోహన్, మల్లేశంను విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ రాజశేఖర్, ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.